క్లుప్తంగా

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు

దాచేపల్లి : వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల్లో సబ్సిడీపై జీలుగు, జనుము, పిల్లిపెసర విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయశాఖ అధికారిణి డి.పాపకుమారి సోమవారం తెలిపారు. జీలుగులు ఎకరానికి 10 కేజీలు రూ.440, జనుము ఎకరానికి 10 కేజీల చొప్పున రూ.440, పిల్లిపెసర ఎకరానికి 8 కేజీలు రూ.536 చొప్పున ఇస్తున్నామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె చెప్పారు.

బేకరీలో చోరీ



దాచేపల్లి : స్థానిక కారంపూడి రోడ్డులోని బెంగళూరు బేకరీలో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తి బేకరి వెనుక గోడను పగులగొట్టి అందులోకి ప్రవేశించాడు. సుమారు రూ.లక్ష నగదును చోరీ చేశాడు. ఈ దృశ్యాలు బేకరీలోని సీసీ కెమెరాలో నమోదు అయ్యాయి. బేకరి నిర్వాహకుడు చోరీ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ దాసరి శివనాగరాజు చోరీ జరిగిన బేకరీలోని సీసీ కెమెరాలో నమోదు అయిన దృశ్యాలను పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివనాగరాజు చెప్పారు.

ట్యాంకు ద్వారా నీటి సరఫరా



పిడుగురాళ్ల: పట్టణంలో వేసవి దృష్ట్యా నీటి ఎద్దడి లేకుండా ఉండేందుకు మున్సిపల్ కార్యాలయం ఆధ్వర్యంలో వాటర్ ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం పట్టణంలోని శ్రీనివాస కాలనీలో వాటర్ ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేశారు. దీంతో మహిళలు వాటర్ ట్యాంక్ వద్ద నీటిని పట్టుకున్నారు.

ఘనంగా లూథరన్ చర్చి వార్షికోత్సవం



క్రోసూరు: స్థానిక ఆంధ్ర ఇవాంజికల్ లూథరన్ చర్చి 8వ వార్షికోత్సవాలు మూడు రోజులుగా ఘనంగా నిర్వహించారు. సోమవారం ముగింపు సందర్భంగా ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చి పాస్టర్ రెవ.డాక్టర్ ఎం.సుందరరావు ఏసు ప్రభువు చెప్పిన బోధనలు విశ్వాసులకు తెలియపరిచారు. క్రోసూరు చర్చి ద్వారా చుట్ట పక్కల గ్రామాలకు పరిచర్య అందిందబడుతుందని వివరించారు. విశ్వాసులకు ప్రేమ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక సంఘ పెద్దలు పర్యవేక్షించారు. పలు సంఘాల సేవకులు, డెలిగేట్ మనోహర్, సంఘ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణ



అమరావతి: పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాలతో మండల పరిధిలోగల ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేయుచున్న మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ఎంపీడీఓ ఆఫీసు మీటింగ్ హాల్‌లో సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వారికి వంటల పోటీలు నిర్వహించి, బహుమతులు ప్రదానం చేశారు. మండల విద్యాశాఖాధికారులు ఏకుల ప్రసాదరావు, శివబాబు అధ్యక్షతన నిర్వహించిన శిక్షణలో విద్యార్థికి దినసరి ఆహారంలో ఖచ్చితంగా అందించాల్సిన పోషకాలు, వాటి ఆవశ్యకత, మోతాదులో అందకపోతే ఎదురయ్యే అనారోగ్య సమస్యల గురించి వివరించారు. వంట చేసేటప్పుడు పోషకాలు కోల్పోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గోరుముద్ద పథకం ద్వారా ప్రభుత్వం అందిస్తున్న మెనూ అమలును ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రస్థాయిలో శిక్షణ పొందిన రిసోర్స్ పర్సన్ నర్రా వెంకాయమ్మ గోరుముద్ద పథకానికి సంబంధించిన కొన్ని ముఖ్య సూచనలు, సలహాలు అందించారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శ్రీ రామకృష్ణ హిందూ హై స్కూల్ నందు వంట పోటీలు నిర్వహించారు. వంటల పోటీల్లో విజేతలకు ఎంఈఓ శివబాబు బహుమతులు ప్రదానం చేశారు. మండలంలోని అన్ని గ్రామాల 95 మంది మధ్యాహ్న భోజన నిర్వాహకులు పాల్గొన్నారు.

బోధనలో ఆదర్శం

- పది, ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు
- నాడు–నేడు ద్వారా పాఠశాలలో పూర్తి స్థాయి వసతులు
- ఎన్ఎంఎంఎస్‌లో ప్రతిభ చాటుతున్న విద్యార్థులు
- పాఠశాలలో ప్రవేశాలకు ఆసక్తి చూపుతున్న విద్యార్థులు



పల్లెగుంత ఆదర్శ పాఠశాల

గురజాల : కార్పొరేట్ పాఠశాలలను తలపించేలా అధునాతన భవనాలు... ఆహ్లాదకరమైన వాతావరణం, మెరుగైన వసతులు, అత్యుత్తమ విద్యాబోధనతో గురజాల మండలం పల్లెగుంత ఆదర్శ పాఠశాల ఆదర్శంగా నిలుస్తుంది. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు–నేడు కార్యక్రమం ద్వారా మొదటి విడతలో రూ.67 లక్షలతో పాఠశాలలో పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించారు. ఈ ఏడాది విద్యార్థులు సాధించిన ఉత్తమ ఫలితాలు చూసి తల్లిదండ్రులు తమ పిల్లలను ఆదర్శ పాఠశాలలో చేర్పించడానికి ఆసక్తి చూపుతున్నారు. ఈ ఏడాది 6వ తరగతిలో ప్రవేశాలకు 189 మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు.

విద్యార్థులకు వరం ఆదర్శ పాఠశాల

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు పల్లెగుంత ఆదర్శ పాఠశాల వరంగా మారింది. ఈ పాఠశాలలో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ప్రస్తుతం 820 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాలలో ఉపాధ్యాయులు, పరిశీలనాత్మక, సృజనాత్మక పద్ధతిలో విద్యాబోధన చేస్తున్నారు. అధునాతన తరగతి గదులు, డెస్కులు, విద్యార్థులకు అందుబాటులో ఉంచారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వారు కూడా ఉత్తమ ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకున్నారు.

బాలికలకు హాస్టల్ వసతి

ఏపీ మోడల్ స్కూల్‌లో 9 నుంచి ఇంటర్మీడియట్ చదువుతున్న బాలికలకు పాఠశాల ఆవరణలోనే



పాఠశాల ప్రాంగణంలో హాస్టల్ వసతి

హాస్టల్ వసతి ఉంది. మూడు పూటల మంచి పోషకాలతో కూడిన పౌష్టికాహారం, అందిస్తూ, విద్యార్థులకు సౌకర్యాలు కల్పించడం జరిగింది. హాస్టల్ వసతితో గ్రామీణ ప్రాంత విద్యార్థులు చక్కగా చదువుకుంటున్నారు.

ప్రత్యేక దృష్టి...

పాఠశాలలో ప్రతి విద్యార్థిపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుంది. ప్రతి ఏటా ఎన్ఎంఎంఎస్‌కు విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. 6వ తరగతిలో చేరేందుకు 189 మంది దరఖాస్తు చేసుకోగా 180 మంది అర్హత పరీక్ష రాయగా వారిలో 71 మంది అర్హత సాధించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఆదర్శ పాఠశాల ఓ వరం. నిరుపేద కుటుంబానికి చెందిన వారికి మంచి అవకాశం ఈ పాఠశాల. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఈ పాఠశాలలోనే చదువుకునే అవకాశం ఉంది.

పది, ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు



ప్రతి ఏడాది పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు ఈ పాఠశాలకే సొంతం. ఈ ఏడాది పదవ తరగతి పరీక్షలు 73 మంది రాయగా వారిలో 72 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి 99 శాతం నమోదు జరిగింది. ఇంటర్మీడియట్‌లో 72 శాతం ఉత్తీర్ణత సాధించారు. పదవ తరగతిలో 25 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారు. ప్రతి సంవత్సరం తప్పనిసరిగా ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్)కు ఇక్కడి విద్యార్థులు ఎంపికవుతున్నారు. ఈ ఏడాది నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. క్రీడల్లో కూడా మంచి ప్రతిభ కనబరుస్తున్నారు.

– వి.ఉషశ్రీ, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్, పల్లెగుంత

ప్రజలలో మనోధైర్యం కల్పించేందుకే కవాతు



రెంటచింతలలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఏఎస్పీ రమణమూర్తి



విజయపురిసౌత్‌లోని కవాతులో నెల్లూరు క్రైమ్ ఏఎస్పీ ప్రసాద్, పోలీస్ అధికారులు



మల్లవోలులో పోలీస్ కవాతు నిర్వహిస్తున్న పోలీస్ ప్రత్యేక బలగాలు

రెంటచింతల: గ్రామాలలోని ప్రజలలో మనోధైర్యం కల్పించేందుకే ప్రత్యేక బలగాలతో గ్రామ పుర వీధులలో ఫ్లాగ్ మార్చ్ (కవాతు) నిర్వహిస్తున్నామని అడిషనల్ ఎస్పీ జి.వి.రమణమూర్తి, అన్నారు. సోమవారం రెంటచింతలలో సీఏఎస్ఎఫ్ ప్రత్యేక దళాలు, ఏఆర్ పోలీసు సిబ్బందితో కవాతు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకు, ఎన్నికల ఫలితాల అనంతరం గ్రామాలలో ఎలాంటి హింసాత్మక ఘటనలు చోటు చేసుకోకుండా ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా సమస్యాత్మక గ్రామాలలో కవాతు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామాలలో ప్రశాంత వాతావరణం నెలకొనడానికి ప్రజలందరూ పోలీసులకు పూర్తిగా సహకరించాలన్నారు. ఎన్నికల ఫలితాల సమయంలో హింసాత్మక ఘటనలు జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టామన్నారు. గ్రామాలలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించితే అటువంటి వారిపై కఠిన చ్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ పి.వెంకటేశ్వర్లు, సీఐ శివాజీ, ఎస్ఐలు ఎం.ఆంజనేయులు, కె.శ్రీనివాసరావు తదితరులున్నారు.

ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

విజయపురిసౌత్: ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని నెల్లూరు క్రైమ్ అడిషనల్ ఎస్పీ ఏపీబీవీ ప్రసాద్ అన్నారు. సోమవారం మాచర్ల మండలం విజయపురిసౌత్‌లో అడిషనల్ ఎస్పీ ఆధ్వర్యంలో పోలీసు కవాతు నిర్వహించారు. గ్రామ పుర వీధుల్లో తిరుగుతూ ప్రజలను చైతన్య పరిచారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ ప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో రాజకీయ పార్టీల నాయకులు సమన్వయం పాటించాలని సూచించారు. గొడవలు, అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏదైనా సమస్య ఉంటే పోలీసులకు తెలియపరచాలని ఆయన కోరారు. అనంతరం స్థానిక పోలీసులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు ట్రాఫిక్ డీఎస్పీ ఎ.శ్రీనివాస్, విజయపురిసౌత్ ఎస్ఐ పట్టాభి రామయ్య, ఏఎస్ఐ సోమ్లా నాయక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

మాచవరం: గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ అమీనుద్దీన్ హెచ్చరించారు. పోలింగ్ అనంతరం గ్రామాల్లో జరిగిన ఘటనలను దృష్టిలో ఉంచుకుని జిల్లా పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని పిల్లుట్ల, మల్లవోలు గ్రామాల్లో సోమవారం పోలీస్ కవాతు నిర్వహించారు. అనంతరం ఆయా గ్రామాల్లో అనుమానిత ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఓట్ల లెక్కింపు, ఫలితాల సందర్భంగా గ్రామాల్లో ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు చేపట్టినట్లు తెలియజేశారు. అల్లర్లు, గొడవలకు పాల్పడితే పోలీసుల దృష్టికి తీసుకురావాలని అన్నారు.

నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- కంది పంట సాగుకు వాతావరణం అనుకూలం
- వ్యవసాయాధికారి వై అమీర్‌రెడ్డి



దుర్గి: వర్షాధారంపై సాగు చేస్తున్న కంది పంటకు అనుకూల వాతావరణం నెలకొని ఉందని మండల వ్యవసాయాధికారి వై అమీర్‌రెడ్డి అన్నారు. సోమవారం పలు గ్రామాలలో పర్యటిస్తూ స్థానిక రైతులతో కలిసి ఆయన రాబోవు ఖరీఫ్‌కు సాగు చేస్తున్న పంటల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులకు ఆయన సూచనలు చేస్తూ మంచి ధర, దిగుబడికి కంది పంట అనుకూలంగా ఉంటుందన్నారు. మండల వ్యాప్తంగా 10 వేల నుంచి 12 వేల హెక్టార్ల కంది సాగు చేసే అవకాశముందని తెలిపారు. తొలకరికి ముందే భారీ వర్షాలతో మండల వ్యాప్తంగా రైతులు పూర్తి వ్యవసాయ పనులలో నిమగ్నమయ్యారన్నారు. కొంత మేరకు పత్తి పంట సాగు చేశారని, మరిన్ని ఎకరాలలో పత్తి, కంది పంటలు సాగు చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారన్నారు. గత ఖరీఫ్‌లో కంది పంట రైతులకు మేలు చేకూర్చిందని, ఈ సంవత్సరం కూడా అటువంటి వాతావరణమే నెలకొందని, అధిక వ్యయంతో పెట్టుబడులు పెట్టి నష్టపోకుండా తక్కువ పెట్టుబడితో అధిక లాభం పొందే పంటల వైపు రైతులు మొగ్గు చూపాలని కోరారు. పత్తి, మిర్చి విత్తనాలను స్థానిక డీలర్ల వద్ద కొనేటప్పుడు రైతులు తప్పనిసరిగా రశీదును పొందాలన్నారు. దీని వలన పంట వేసిన తరువాత నష్టపోయినా, ఇబ్బందులు వచ్చినా ఎరువులు, పురుగు మందులు నకిలీవి, కల్తీవి, కంపెనీ కానివి డీలర్ అమ్మితే ఆ రశీదు చూపించి అతని వద్ద నుంచి నష్టపరిహారం పొందటమే కాకుండా, ఆ షాపును సీజ్ చేసి, అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవటానికి అవకాశముందన్నారు. రైతులు దీనిని గమనించి ప్రతి ఒక్కరూ రశీదును తప్పక పొందాలన్నారు. డీలర్ బిల్లు లేకపోతే తగ్గిస్తానని చెప్పినా రైతులు నమ్మవద్దని, ప్రభుత్వ నిబంధనలకనుగుణంగా రశీదు పొందితే రైతుకు లాభం ఉంటుందన్నారు.

విత్తన షాపుల్లో తనిఖీలు



మాచర్ల: పట్టణంలోని విత్తనాల షాపులను మాచర్ల వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీలు చేశారు. పత్తి ఫ్యాక్టరీ, అంబేద్కర్ సెంటర్ తదితర ప్రాంతాల్లో విత్తనాల షాపులను పరిశీలించారు. విత్తనాల షాపుల్లో బీజీ, బీజీ-4 పత్తి విత్తనాలు విక్రయించేవారిపై చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఆయా కంపెనీలకు సంబంధించిన ఫారం సీ పరిశీలన జరిపారు. రికార్డుల్లో వివరాలు నమోదు చేశారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలన్నారు. పంటకాలం పూర్తయ్యే వరకు రైతులు ఆ బిల్లులను భద్రపరచాలన్నారు. ప్రభుత్వం సూచించిన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. ఎమ్మార్పీ ధరలకు మాత్రమే విత్తనాలు రైతులకు విక్రయించాలన్నారు. తనిఖీల్లో మండల వ్యవసాయ శాఖ అధికారి కట్టా లక్ష్మారెడ్డి, వ్యవసాయ విస్తీర్ణ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలందరినీ బడిలో చేర్పించాలి



సత్తెనపల్లి: బడికి వెళ్లడం పిల్లల హక్కు అని, వారిని చదివించడం తల్లిదండ్రుల బాధ్యత అని బడి బయట ఉన్న పిల్లలందరిని బడిలో చేర్పించాలని డీబీఆర్సీ గుంటూరు, పల్నాడు జిల్లాల రీజినల్ కో-ఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప పిలుపునిచ్చారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో సత్తెనపల్లి మండలం నందిగామ ఎస్సీ కాలనీలో అంగన్‌వాడీ కార్యకర్త సుజాత, వాణి సోమవారం విద్యా చైతన్య ప్రచారోద్యమ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చిన్నప్ప మాట్లాడుతూ సమాజంలో గౌరవం రావాలంటే ప్రతి ఒక్కరూ బడికి వెళ్లి చదువుకోవాలన్నారు. చదువు వల్ల పరిశుభ్రత, ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన పెరుగుతుందన్నారు. ఈ క్రమంలో గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని, ప్రభుత్వం ఇస్తున్న అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, విద్యా కానుక పథకాల లబ్ధిని పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా దార్ల మేరీ ఉన్నారు.

రోగుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించండి

వెల్దుర్తి: మండల పరిధిలోని ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు బత్తిన శ్రీరామ్ ఆధ్వర్యంలో నర్సులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ప్రజలకు అందుబాటులో ఉండి వారికి కావాల్సిన వైద్య సేవలను తక్షణమే అందించే విధంగా చూడాలన్నారు. ప్రతి నెలా జరిగే సమీక్ష సమావేశంలో భాగంగా పీహెచ్‌సీ పరిధిలోని 13 గ్రామాలకు చెందిన 12 మంది నర్సులకు ప్రజల ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారికి కావాల్సిన మందులను ఉచితంగా అందించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధుల గురించి ప్రజలకు వివరించి వారిని



ఉప్పలపాడు పీహెచ్‌సీలో నర్సులతో సమీక్ష సమావేశంలో డాక్టర్ శ్రీరామ్

చైతన్యం చేయాలన్నారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం తీసుకునేలా సూచనలు చేయాలన్నారు. వారికి ప్రతి నెలా చేసే వైద్య పరీక్షలను సకాలంలో చేయాలన్నారు.

నాణ్యమైన పౌష్టికాహారం అందించండి



ఎండీఎం తయారీదారుల వంటలను పరిశీలిస్తున్న ఎంఈవో సురేష్



వంటల పోటీలను పర్యవేక్షిస్తున్న ఎంఈవో సాంబశివరావు

మాచర్ల రూరల్: పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు, రుచికరమైన పౌష్టికాహారం అందించాలన్న సంకల్పంతో ప్రభుత్వం అందించే మధ్యాహ్న భోజనాన్ని రుచి, శుచితో పాటు బలవర్థకమైన ఆహారాన్ని అందించే విధంగా అందరూ సమష్టిగా పనిచేయాలని ఎంఈవో అల్లి సురేష్ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలోని మండల, పట్టణానికి చెందిన మధ్యాహ్న భోజన నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించటంలో ఎండీఎం నిర్వాహకులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. విద్యార్థులు ఒక్క ముద్ద కూడా వృధా చేయకుండా ఉపాధ్యాయులు సైతం ఇక్కడే తినేలా నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. వీటితో పాటు వేరు శనగ చిక్కీలు, బెల్లం రాగి జావ, తయారు చేయటంలోనూ ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఈ సందర్భంగా మండలంలోని పలు పాఠశాలల మిడ్ డే మీల్స్ నిర్వాహకులకు వంటల పోటీలు నిర్వహించి రుచికరమైన ఆహారాన్ని వండిన నిర్వాహకులకు బహుమతులు అందజేశారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

గురజాల : మెనూ ప్రకారం పాఠశాలల్లో విద్యార్థులకు భోజనం అందించాలని ఎంఈవో–2 ఎం.సాంబశివరావు సూచించారు. స్థానిక మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో సోమవారం మధ్యాహ్న భోజన నిర్వాహకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో వంట చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సలహాలు అందించారు. ఆహారం రుచికరంగా తయారు చేయడానికి తీసుకోవాల్సిన చర్యలు, వంటగది శుభ్రత పాటించాలన్నారు. వంట గదిలో గ్యాస్ లీకైతే తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల సమస్యలను ఎంఈవో అడిగి తెలుసుకున్నారు. ముందుగా నిర్వాహకులకు వంటల పోటీలు నిర్వహించి రుచిగా తయారుచేసిన వారికి బహుమతులు అందించారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి కన్సలేషన్ బహుమతులు అందించారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకున్నాం

మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు



పిడుగురాళ్ల: పిడుగురాళ్ల మున్సిపల్ కార్యాలయ పరిధిలో అన్ని వార్డులకు మంచినీటి సరఫరా చేసేందుకు కార్యాచరణ చేపట్టామని మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకొని పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో నీటి ఎద్దడి లేకుండా చేసేందుకు చర్యలు తీసుకోవటం జరిగిందన్నారు. కృష్ణా జలాలు పైపులైన్ ద్వారా ప్రజలకు అందిస్తున్నామన్నారు. పైపులైన్‌లు పూర్తికాని ప్రాంతాల్లో వాటర్ ట్యాంకుల ద్వారా నీటి సరఫరా చేస్తున్నామన్నారు. అలాగే పట్టణంలోని వార్డులలో సమస్యలను ఆయా వార్డు కౌన్సిలర్లు కౌన్సిల్ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. వాటన్నిటిని పరిష్కరించే విధంగా అడుగులు వేస్తున్నామని చైర్మన్ తెలిపారు. అలాగే చిన్న చిన్న అభివృద్ధి పనుల్లో మున్సిపల్ అధికారులు త్వరలోనే చర్యలు చేపట్టటం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు షేక్ జైలాబ్దిన్, కొమ్ము ముక్కంటి, మున్సిపల్ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

సకాలంలో వర్షాలతో రైతుల్లో ఆనందం

వెల్దుర్తి: ఈ ఏడాది మే నెలలోనే వర్షాలు కురవటంతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. పంటలను సాగు చేసుకునేందుకు రైతులు భూములను సిద్ధం చేస్తున్నారు. మే నెలలోనే 10 రోజు వ్యవధిలోనే రెండుసార్లు వర్షాలు కురవటంతో భూములు పదునయ్యాయి. రైతులు పొలాలను దుక్కులు దున్ని చదును చేసుకుంటున్నారు. పత్తి, కంది పంటలను విత్తుకునేందుకు సిద్ధమవుతున్నారు. రైతులు దుక్కులను లోతుగా దున్నుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. రైతులు తమ భూముల్లో సేంద్రియ ఎరువులను వాడుకోవటం వలన పంటలు బాగా పండుతాయని పెట్టుబడులు తగ్గి లాభాలు వస్తాయని అధికారులు చెబుతున్నారు. వేసవి కాలంలో దుక్కులు దున్నుకోవటం వలన పచ్చిరొట్ట భూమిలో కలిసి



మండాదిలో పంటల సాగుకు దుక్కి దున్నిన పొలం

భూములు సారవంతమవుతాయి. సకాలంలో వర్షాలు పడటంతో పంటలు సాగు చేసుకునేందుకు రైతులు సిద్ధమవుతున్నారు.

ఇద్దరికి ఇంటర్నేషనల్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్ల ప్రదానం



సత్కారం అందుకుంటున్న బెజగం రవికుమార్



సత్కారం అందుకుంటున్న డాక్టర్ రమాదేవి

సత్తెనపల్లి: కళా, సాహితీ రంగాల్లో పట్టణానికి చెందిన కళాకారుడు బెజగం రవికుమార్, సాహితీవేత్త డాక్టర్ సరికొండ రమాదేవి ఇంటర్నేషనల్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్లు అందుకున్నారు. ఒంగోలు పట్టణంలో లిటిల్ చాంప్స్ అకాడమీ, కేఆర్ ఫౌండేషన్ సంయుక్తంగా మల్లయ్య లింగయ్య భవన్‌లో ఈ నెల 26న వివిధ రంగాల్లో ప్రతిభావంతులను గుర్తించి, ఇంటర్నేషనల్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్లను ప్రదానం చేసి సత్కరించారు. సర్టిఫికెట్లు పొందిన వారిలో ఇద్దరు సత్తెనపల్లి వాసులు ఉండటం గమనార్హం. వారిద్దరినీ స్థానిక ప్రజలు ప్రత్యేకంగా సోమవారం అభినందించారు.

మాజీ ప్రధాని నెహ్రూకు ఘన నివాళి



నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చంద్రపాల్, నాయకులు

సత్తెనపల్లి: భారతదేశ మొట్టమొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ కాలంలో పంచవర్ష ప్రణాళిక అమలు చేయడం ద్వారా దేశం ఎంతో పురోగతి సాధించిందని కాంగ్రెస్ పార్టీ సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుక్కా చంద్రపాల్ అన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి కార్యక్రమం పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దాసరి జ్ఞానరాజు పాల్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చంద్రపాల్ మాట్లాడుతూ పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ స్వాతంత్ర్య ఉద్యమాల్లో పాల్గొని జైలు జీవితం గడిపారన్నారు. ముందుగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి మాదంశెట్టి వేదాద్రి, కాంగ్రెస్ నాయకులు షేక్ అజీమ్, కోట ఆనంద్, షేక్ ఆరిఫ్, కోటంపాటి సాంబశివరావు, షేక్ సుభాని పాల్గొన్నారు.